క్లుప్తంగా

బందరు పోర్టును షూటింగ్ స్పాట్‌గా చేయండి



తెనాలిరూరల్: బందరు పోర్టును సినిమా షూటింగులకు ఉపయోగపడేలా తగు మార్పులు, చేర్పులు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను 'మా–ఏపీ' వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా కోరారు. శనివారం సచివాలయంలో మంత్రిని కలిసి పలు విషయాలు చర్చించారు. మచిలీపట్నం సముద్రతీరంలో సినిమా షూటింగులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని మంత్రిని కోరినట్లు దిలీప్ రాజా తెలిపారు. ఆయన వెంట నటుడు మిలటరీ ప్రసాద్, ఇంటూరి విజయభాస్కర్ ఉన్నారు.

నూతన వృత్తి విధానాలపై అవగాహన



తెనాలిఅర్బన్: వృత్తిలో వస్తున్న నూతన విధానాలపై అంతా అవగాహన కలిగి ఉండాలని అరుణ జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ అధినేత కొత్త శేషుకుమార్ సూచించారు. అరుణ జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్, స్పర్ష్ పెరల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ ఆవరణలో శుక్రవారం రాత్రి మెగా ప్లంబర్ మీట్‌ను నిర్వహించారు. ప్లంబింగ్ వృత్తిలో వస్తున్న మార్పులు, ఆధునిక యంత్రాల పనితీరును తెలియజేశారు. అనంతరం ప్లంబర్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పర్ష్ పెరల్ సేల్స్ మేనేజర్ సాయి స్వరూప్, కుమార్‌పంప్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం



తెనాలిఅర్బన్: వ్యాధులపై అంతా అవగాహన కలిగి ఉండాలని మారీసుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వాడక దేవి కావాణి పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మారీసుపేటలోని చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం వ్యాధులపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. విషజ్వరాలు, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో డయేరియా ఎక్కువగా విజృంభిస్తుందని కలుషిత ఆహారం, నీరు తాగకూడదని సూచించారు. విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సమావేశంలో హెచ్‌వీ విజయకుమారి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దాసరి సత్యనారాయణ, అప్పారావు, ఎం.వాణి, కె.కల్పన తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన శిబిరం వద్ద శనివారం పేదలు, వృద్ధులకు అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ కౌన్సిలర్ కుక్కల ముక్తేశ్వరరావు సోదరుడు సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ కుమారుడు కె.రాజ, నల్లగొర్ల శివరాఘవయ్య, దానబోయిన గోపి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మురుగునీటి పంపింగ్ హౌస్‌కు మరమ్మతులు



తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగునీరు బయటకు పంపేందుకు సుల్తానాబాద్‌లో గతంలో ఏర్పాటు చేసిన మురుగునీటి పంపింగ్ హౌస్‌కు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయించారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పంపింగ్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల ద్వారా వచ్చిన నీటిని శివారు ప్రాంతాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మురుగు నీటి పంపింగ్ హౌస్‌కు మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై ఎక్కువసేపు నీరు నిల్వ ఉండకుండా పంపింగ్ హౌస్‌లోని మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపవచ్చని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈ రాజు ఉన్నారు.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

- విద్యుత్‌శాఖ డీఈఈ చిరంజీవి
- వినియోగదారుల సమావేశంలో విద్యుత్ సమస్యలపై వినతుల స్వీకరణ



సమావేశంలో వినియోగదారులతో మాట్లాడుతున్న డీఈఈ చిరంజీవి

తెనాలిరూరల్: వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి తెలిపారు. స్థానిక చెంచుపేటలోని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. డీఈఈ చిరంజీవి పాల్గొని విద్యుత్ వినియోగదారులు సూచించిన పలు సమస్యలను నమోదు చేసుకున్నారు. వినియోగదారుల తరఫున పలువురు ప్రజా సంఘాల నాయకులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. రేపల్లె మండలంలో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. జగ్గడిగుంటపాలెంలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని కెవి సత్యనారాయణ అధికారులకు చెప్పారు. విద్యుత్ బిల్లుల డిమాండ్ నోటీస్‌లో ట్రూ అప్ చార్జెస్, ఇంధన సర్‌చార్జీలను వేయొద్దని, 2019–2020నాటి విద్యుత్ టారిఫ్‌ను అమలు చేయాలని, డిస్కంల రుణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మరో వినియోగదారుడు ప్రసాద్ 11 పాయింట్లతో కూడిన సమస్యలను డీఈఈకి అందించారు. బ్రేక్ డౌన్ సమస్యలు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, అమరావతి కాలనీ, ఆలపాటి నగర్ తదితర ప్రాంతాల్లో ఓల్టేజీ సమస్యలు వంటి వాటిని ఫిర్యాదులో పొందుపరిచారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఈఈ చిరంజీవి తెలిపారు. అత్యవసరంగా పాత ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాల్సి ఉందని అన్నారు. కొత్తపేట, అమరావతి కాలనీలలో కూడా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేయాల్సి ఉందని చెప్పారు. వినియోగదారులు సూచించిన సమస్యలు పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని ఈఈ చిరంజీవి తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించే సమయంలో ఆర్‌బీఐ మార్గదర్శకాలు అనుసరించి ఫోన్ పే, గూగుల్ పే, పేటియం, ఇతర యాప్స్‌లో ఏపీసీపీడీసీఎల్ డిస్కం పేరు ఇకపై కనిపించదని, ఏపీసీపీడీసీఎల్ కంజ్యూమర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈ బి. అశోక్‌కుమార్, డి–1 ఏఈ దుర్గారావు, డి–2 ఏఈ ఎం. లక్ష్మీనారాయణ, చేబ్రోలు ఏఈ పీవీ సుధీర్, తెనాలి రూరల్ ఏఈ సీహెచ్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తెనాలిరూరల్: ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ తెనాలి ఏడీఈ బి.అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వర్షాలలో తడిచిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు తాకి ఉన్న చెట్లను తాకకూడదన్నారు. తేమ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లోని విద్యుత్ మోటార్లు, ఇతర పరికరాలు స్విచ్‌లను వేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. తడి వస్త్రాలు ఆరవేసే తీగలు విద్యుత్ తీగలకు దగ్గరగా ఉండకుండా చూడాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్న సమయంలో ఇళ్లలోని విద్యుత్ పరికరాలను స్విచ్ఛాఫ్ చేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే ఐతానగర్ ప్రాంతంలోని వారు 9490615523, రామలింగేశ్వరపేట ఏరియాలోని వారు 8331014931, చెంచుపేట ఏరియాలోని వారు 9490615520, కొలకలూరు పరిధిలోని గ్రామాల వారు 9491043493, అంగలకుదురు పరిధిలోని గ్రామాల వారు 9490615524 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావినూతల సాంబశివరావు శత జయంతి, గురు పౌర్ణమి వేడుకలను సోమవారం నిర్వహించనున్నారు. గ్రామ జెడ్పీ హైస్కూలులో జరిగే కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఫౌండేషన్ సలహాదారుడు శాఖమూరి నారాయణ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేయడంతో పాటు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేనున్నట్టు చెప్పారు.

నేడు బీటీఏ కార్యకర్తల సమావేశం

తెనాలి: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరుగుతుందని బీటీఏ రాష్ట్ర కార్యదర్శులు గురిందపల్లి వేమయ్య, బట్టు వెంకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నేటి విద్యారంగ సమస్యలపై చర్చించే ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. సంబంధీకులు అంతా హాజరు కావాలని కోరారు.

శ్రీఆంజనేయుడికి నాగవల్లి దళార్చన



తెనాలి: పట్టణ మారిస్‌పేటలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి)లో గురుపౌర్ణమి ఉత్సవాలలో రెండవ రోజు ఆలయంలో వేంచేసి యున్న ఉత్తరముఖ శ్రీఅంజనేయుడికి అభిషేకం, నాగవల్లి దళార్చన (తమలపాకులు)తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు లంక శివానంద్ కుమార్ మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీ సీతారామ చంద్రమూర్తులకు అభిషేకం చేసి, రెండోరోజున శ్రీవీరాంజనేయుడికి అభిషేకం, ఆకుపూజ జరిపించినట్టు తెలిపారు. ఆదివారం సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ధర్మకర్తలు కోనపల్లి నారాయణస్వామి, లంక శివానందకుమార్, లంక శివ ఆంజనేయప్రసాద్, అర్చకులు దిన ముని ధనుష్ సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణ చేశారు.

గురువులను గౌరవించుకోవడం భారతీయ సంస్కృతి



ఎస్వీ రమణను సత్కరించి, జ్ఞాపిక బహూకరిస్తున్న రామచంద్రరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: గురువులను గౌరవించుకోవడం అనే సంప్రదాయం భారతీయ సంస్కృతిలో ఇమిడి ఉందని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో గురుపౌర్ణమి వేడుకలను శనివారం నిర్వహించారు. విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యను నేర్చుకోవాలంటే అది గురువు ద్వారానే సాధ్యమని, గురువు లేకుండా నేర్చుకునే విద్యకు పరమార్థం ఉండదన్నారు. తల్లిదండ్రుల కంటే మిన్నగా గురువులను గౌరవించుకునే సంస్కృతి, సంప్రదాయం భారతీయ వ్యవస్థలో ఉందని చెప్పారు. ప్రపంచానికి గురు శబ్దాన్ని అందించిన ఘనత భారత దేశానికి చెందుతుందని అన్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థలోని లోటుపాట్లను వివరిస్తూ విద్యార్థులు నైపుణ్యాలతో కూడిన విద్యను నేర్వాలని, ఎల్లప్పుడే గురువులను గౌరవించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఎస్వీ రమణను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.హేమాంబ, సీహెచ్ కృష్ణ, ఉషశ్రీ పాల్గొన్నారు.

విద్యానగర్ పురవీధుల్లో సాయి గ్రామోత్సవం

నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా ఆరో రోజైన శనివారం స్వామికి పూల సేవ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై, వివిధ పుష్పాలతో స్వామి వారిని సేవించారు. సాయంత్రం పుర వీధుల్లో గ్రామోత్సవం, ఇరువైపులా భక్తులు తాడు లాగుతూ ముందుకు కదిలారు. కోలాట భజనలు, సాయి సంకీర్తనలతో మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి



కురగల్లు పొలాల్లో మృతి చెందిన గేదెలు

కురగల్లు(మంగళగిరి): సీఆర్డీఏ ప్రాంతంలోని కురగల్లు గ్రామంలో విద్యుదాఘాతంతో శనివారం ఐదు గేదెలు మృతి చెందాయి. కురగల్లు గ్రామానికి చెందిన 10 గేదెలు పొల్లాల్లోకి మేతకు వెళ్లాయి. గ్రామ శివారులో విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో గేదెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో ఐదు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. తోట సాంబశివరావు నాలుగు గేదెలు, కోలవెన్ను పానయ్య ఒక గేదెను కోల్పోవాల్సి వచ్చింది. రాజధాని కోసం రైతుల నుంచి సేకరించిన భూముల్లో జంగిల్ క్లియరెన్స్ లేక మొక్కలు పెరిగిపోయి.. విద్యుత్ వైర్లకు తగులుతున్నాయి. సీఆర్డీఏ భూముల్లో వేసిన విద్యుత్ స్తంభాల వైర్లు మరమ్మతులకు నోచుకోకపోవడం.. విద్యుదాఘాతానికి కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు విద్యుత్ స్తంభాలు ఒరగడంతో విద్యుత్ తీగలు పొల్లాల్లో కిందకు వేలాడుతున్నాయి. నిర్మానుష్య ప్రాంతం కావడంతో విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం అందలేదని.. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. పశు వైద్యాధికారి ఇచ్చే నివేదలను బట్టి ఒక్కో గేదెకు రూ.లక్ష పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటానమని డీఈఈ తెలిపారు.

ఫిరాయింపుల నిరోధక చట్టం ఉనికే ప్రశ్నార్థకం



మాట్లాడుతున్న న్యాయవాది వి.ఎస్.ప్రసాదరావు

లక్ష్మీపురం: ఫిరాయింపుల నిరోధక చట్టం(1985) ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని న్యాయవాది ముప్పాళ్ల వీఎస్ ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన చర్చ గోష్ఠిలో మాట్లాడారు. దేశంలో స్థిరపడిన బలపడిన రాజకీయ సంస్కృతికి శాసనాలతో, విలువలతో నిమిత్తం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికల పదజాలంలో 'ఆపరేషన్ ఆకర్ష్‌లు, జంప్ జిలానీ'లు రాజకీయాల్లో భాగమైపోయాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, విద్యావేత్త ఎస్.రవిబాబు, పి.భావన్నారాయణ, మల్లేశ్వరరావు చర్చలో పాల్గొని ప్రసంగించారు.

నెల్సన్ మండేలాకు నివాళి..

ప్రపంచ పౌరులందరూ నెల్సన్ మండేలాను ఆదర్శంగా తీసుకొని మనం జీవిస్తున్న ప్రపంచాన్ని ప్రభావితం చేయటానికి, మార్చటానికి మనలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ సదాశివం, శివ, ప్రకాష్ పాల్గొన్నారు.

వరి విత్తనాలు వెదజల్లిన చేలల్లో జాగ్రత్తలు పాటించాలి

ఏరువాక కేంద్రం, లాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు



నీట మునిగిన వరి చేలవద్ద రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

తెనాలి: వరి విత్తనాలు వెదజల్లిన మాగాణి చేలల్లో వర్షపునీరు నిలిచినట్టయితే, సత్వరం బయటకు పంపుకోవాలని ఏరువాక కేంద్రం, లాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు రైతులకు సూచించారు. వ్యవసాయ అధికారులతో కలిసి శనివారం మండలంలోని నిదరావూరు, అయితానగర్, మల్లెపాడు తదితర గ్రామాల్లోని వరి వెదజల్లిన చేలను పరిశీలించారు. గత మూడు రోజులుగా అధిక వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి చేలల్లో సత్వరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు రైతులకు వివరించారు. వెద వరి విత్తుకొని మొలకరాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించినట్టయితే మొలక రావడానికి అవకాశం ఉందన్నారు. వెదవరి విత్తి 10–30 రోజులైన పొలాల్లో నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు బస్తా డీఏపీ, 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలని సలహానిచ్చారు.

–వర్షాలు తగ్గిన తర్వాత వెద వరి విత్తి 15–20 రోజులైన పొలాల్లో 100 మి.లీ బిస్పైరిబాక్ సోడియం, 330 మి.లీ ఫినాక్సప్రాప్ ఇథైల్ మందును 200 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరా పొలంలో కలుపు నివారణకు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వర్షాలు తగ్గిన తర్వాత వెద వరి విత్తి 30–40 రోజుల మధ్యలో ఉన్న పొలాల్లో 8 గ్రాముల ఆల్ మిక్స్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో కలుపు నివారణకు పిచికారీ చేయాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పొలాల్లో, మరీ ముఖ్యంగా రెండో పంట వేసుకోదగిన పొలాల్లో రైతులు స్వల్ప, మధ్యకాలిక రకాలైన జేజీఎల్ 1798 (125 రోజుల పంటకాలం), ఎంటీయూ 1224 (135 రోజులు), జేజీఎల్ 384 (135 రోజులు) రకాలను వేసుకోవాలని సూచించారు. వీరితో తెనాలి మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్, గ్రామ వ్యవసాయ సహాయకులు నీలవేణి, దీప్తి, వీఏఏలు హోగ్లా, ఎంజెల్, ఏఈవో మోహన్ ఉన్నారు.

కాల్వల్లో వ్యర్థాలను తొలగించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. 36వ వార్డు గంగానమ్మపేటలో శనివారం నిర్వహించిన కాల్వల పూడికతీత పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే కాల్వల్లో తీసిన వ్యర్థాలను వెంటనే అక్కడి నుంచి తొలగించాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, ప్రసాద్, పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

నీట మునిగిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



పొలంలో రైతుతో మాట్లాడుతున్న పాశం రామారావు

తెనాలి: వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా నష్ట పరిహారాన్ని చెల్లించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా తెనాలి మండలంలో కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను శనివారం ఆయన సందర్శించారు. తెనాలి తేలప్రోలు గ్రామం అత్తోట మార్గంలో నీట మునిగిన పొలాలను రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెద పద్ధతిలో నాటిన వరి విత్తనాలు వర్షం పాలైందని రైతులు తమ గోడును వివరించారు. అధిక వర్షాలు తమను తీవ్రంగా దెబ్బతీశాయని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

నీట మునిగిన పొలాల్లోకి పాశం రామారావు బృందం నేరుగా వెళ్లి వర్షపు నీటిలో తేలుతున్న వరి మొలకలను ప్రత్యక్షంగా చూశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ అధిక వర్షాలు పంటలు సాగుచేస్తున్న కౌలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చిందని అన్నారు. ఎకరా వరిసాగుకు రూ.8 వేలు పెట్టుబడి పెట్టిన రైతు, కౌలు రైతులకు రూ.10 వేల నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టపరిహారంతో పాటు ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ఉచితంగా ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలన్నారు. కౌలు రైతులకు పంటలపై రుణ సదుపాయం కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది కౌలు రైతులు డబ్బు కౌలు, ధాన్యం కౌలు చేస్తున్నారని యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పంటకాల్వల్లో పేరుకుపోయిన తూటాకు, గుర్రపుడెక్క తొలగించని కారణంగానే ఖరీఫ్ ఆరంభంలోనే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించారు. సీపీఎం పార్టీ తెనాలి ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ నీటి పారుదల, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ వలి, హయ్యర్‌పేట యువ రైతు వంపుగర్ల సుమంత్, అత్తోట రైతు ఎలివెల కొండలు పంట నష్టాన్ని వివరించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

డీఈఓకు ఏపీటీఎఫ్ విజ్ఞప్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వెళాంగణిరాజు, కె.నరసింహారావు విన్నవించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ పి.శైలజకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్న చోట్ల విద్యాబోధనకు తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. గతంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల సందర్శనలో భాగంగా సంజాయిషీ పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులపై తదుపరి చర్యలను రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు. నూతనంగా ఉద్యోగోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలన్నారు. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సత్వరమే పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆదర్శ గురువు ఎక్కిరాల కృష్ణమాచార్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధ్యాత్మిక రంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన వరల్డ్ టీచర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యులు నేటి తరానికి ఆదర్శ గురువని సుప్రసిద్ధ ప్రవచనకర్త మల్లాది కైలాసనాథ్ అన్నారు. శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో గురుపౌర్ణమి సందర్భంగా 'ఎక్కిరాల కృష్ణమాచార్య జీవితం – విశేషాలు' అనే అంశంపై ధార్మికోపన్యాసం చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జున ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కైలాసనాథ్ మాట్లాడుతూ ఎక్కిరాల కృష్ణమాచార్యులు హిందూ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పని చేశారని వివరించారు. ఆధ్యాత్మిక రంగంలో విశేష ఖ్యాతి గడించిన కృష్ణమాచార్య ప్రవచనం, రచన, జ్యోతిష్యం, సామాజికసేవ తదితర రంగాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి పొందారని తెలిపారు. కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా విదేశాల్లో శిష్య పరంపర ఆయనకు ఉందని వివరించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఎక్కిరాల కృష్ణమాచార్యతో తనకు గల అనుబంధాన్ని, ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఈసందర్భంగా మల్లాది కైలాసనాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, పూర్వ కార్యదర్శి ఎంవీఆర్కే ముత్యాలు, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, విద్యా విషయక సమన్వయకర్త డాక్టర్ కె.కాళిదాసు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, అధ్యాపకులు ఆలూరి నటరాజకుమారి పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కోర్టు ఆదేశాలు లేకుండా బ్యాంకు సిబ్బంది న్యాయవాదులను వెంట బెట్టుకుని వచ్చి ఇంటి బయట గేటు తాళం పగులగొట్టి అక్రమంగా ప్రవేశించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తారకరామానగర్‌లోని హైమావతి నివాసాన్ని విజయకుమార్ కొనుగోలు చేశాడు. అయితే హైమావతి డబ్బులు తీసుకుని రిజిస్ట్రార్ చేయలేదు. విజయకుమార్ రిజిస్ట్రారు చేయాలంటూ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈనేపథ్యంలో శనివారం యూనియన్ బ్యాంకు సిబ్బంది, న్యాయవాదులను వెంట తీసుకుని ఇంటి గేటు తాళాలు పగులగొట్టి లోపలకు వప్రవేశించారు. సమాచారం తెలుసుకున్న విజయకుమార్ వారిని ప్రశ్నించగా, ఇల్లు బ్యాంకు తాకట్టులో ఉందని వారు తెలిపారు. అయితే వారి వద్ద కోర్టు ఆర్డర్లు లేవు. విజయకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

